బొడ్రాయి

'బొడ్రాయి' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

మోసపోతే..గోసపడుతరు

తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ ప్రదాత, వైతాళికుడు, ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ ప్రజా ఆశీర్వాద సభలలో మోసపోతే గోసపడతారని పదేపదే హెచ్చరిస్తున్నారు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లి అది మంచి ఫలితాలను ఇవ్వాలంటే ఓటర్ కీలకం. తమ ప్రతినిధుల జాతకాన్ని నిర్ణయించేది ప్రజలేనని, ఆ సత్తా బ్యాలెట్ బాక్స్‌లో కనపడాలని పదేపదే చెప్తున్నారు. పోటీచేసే వ్యక్తితో పాటు పార్టీ చరిత్రను చూడాలని చెప్తున్నారు.

ఓటు వేసేటప్పుడు పార్టీల చరిత్ర, వాటి వైఖరులు, దృక్పథాలు, ఎన్నుకునే ప్రతినిధి చరిత్ర, తమ అభివృద్ధి పట్ల ఆయన వైఖరులు చూడాలని నొక్కి వక్కాణిస్తున్నారు సీఎం కేసీఆర్. ఇదంతా నిజమేనా అని ఇంటికి పోయిన పిమ్మట ప్రతి ఒక్కరూ చర్చించుకోవాలని, తెలియని వాళ్లకు చెప్పాలని పేర్కొంటున్నారు.

ప్రస్తుత ఎన్నికల్లో మూడు ప్రధాన పార్టీలు పోటీ పడుతున్నాయి. అవి బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు. దేశాన్ని నాలుగు దశాబ్దాలు పాలించిన కాంగ్రెస్‌పార్టీ, పదేండ్లుగా దేశాన్ని పాలిస్తున్న బీజేపీ పదేపదే అబద్ధాలను వల్లె వేస్తున్నాయి. వివిధ ఎన్నికల సభల్లో ప్రజలను అబద్ధాలతో భావోద్వేగాలను రెచ్చగొట్టి వాటిని ఓటుగా మార్చుకొని అధికారం పొందాలని ఆరాటపడుతున్నాయి.

> మరి కాంగ్రెస్ వైఖరులు దృక్పథాలు చూస్తే 1944లో నెహ్రూకు గాంధీ ఉత్తరం రాస్తూ స్వాతంత్ర్యానంతరం మన ఆర్థిక విధానాలలో గ్రామాలే అభివృద్ధికి పట్టుకొమ్మలని కాబట్టి, లఘు, కుటీర, చిన్న తరహా పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే నిజమైన అభివృద్ధి అని, మళ్లీ ప్రపంచ పటంలో భారత్ కనపడుతుందని వెల్లడించారు. కానీ నెహ్రూ తిరిగి గాంధీకి ఉత్తరం రాస్తూ ఈ పల్లె ప్రజలను నమ్మవద్దని, వారు మోసకారులని వారిని అభివృద్ధిలోకి తీసుకురావడం సాధ్యం కాదని జవాబు ఇచ్చారు.

ప్రధాని అయిన తర్వాత నెహ్రూ 1953 జూన్ 23న రష్యాను అధికారికంగా సందర్శించారు. వారి అభివృద్ధి వ్యూహానికి నెహ్రూ ఆకర్షింపబడ్డారు. రష్యా నమూనా మనదేశంలో కూడా ప్రవేశపెట్టాలని 1956లో ఒక పారిశ్రామిక విధానాన్ని రూపొందించారు. అదే భారత ఆర్థిక రాజ్యాంగం. ఇందులో ఏ, బీ, సీ షెడ్యూల్లో ఏ పరిశ్రమలు ఎవరు స్థాపించాలో నిర్ణయించారు. అయితే సీ షెడ్యూల్లోని వినియోగ వస్తు పరిశ్రమల మొత్తాన్ని ప్రైవేట్ రంగానికి అప్పగించారు. పైగా ఉత్పత్తి పద్ధతులపై గాని, వస్తు ఎంపికపై గాని ఎలాంటి షరతులు విధించలేదు. దీని ఫలితమే ఈ దేశంలో నిరుద్యోగం, గాజు తెర ఆర్థిక వ్యవస్థ. మరొకవైపు బిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెల వంటి భారీ పరిశ్రమలు నిర్మించారు. వీటి నుంచి ట్రాక్టర్ లాంటి తేలిక రకం యంత్రాలను తయారుచేసి వాటిని వినియోగ వస్తువు ఉత్పత్తి చేసే రంగంలో ప్రవేశ పెట్టడం వల్ల ఈ దేశంలో ఉద్యోగాలు లేకుండా పోయాయి. ఇది రష్యా నమూనా. అందుకే ఈ ఖర్మ.

సామాజిక న్యాయం కావాలంటే భూసంస్కరణ అవసరమని వీటిని రెండు దశల్లో అమలు జరిపారు. 1969లో పీసీ మహల్ నోబిస్ కమిటీ ఆరు కోట్ల 89 లక్షల ఎకరాల మిగులు భూమి ఉందని అంచనా వేయగా 2013 వరకు ఈ దేశంలో పంచిన భూమి 65.5 లక్షల ఎకరాలు మాత్రమే. 1969 లో బ్యాంకులు జాతీయం చేసింది. వంద రూపాయలు బ్యాంకులు అప్పుగా ఇస్తే అందులో వ్యవసాయరంగానికి ఇచ్చేది 20 రూపాయలు మాత్రమే. 1974లో గరీబీ హఠావో అన్నది. ఐదవ ప్రణాళికలో పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నది. పేదరిక నిర్మూలన జరిగిందా? 1978లో అధికారంలోకి వచ్చిన జనతా ప్రభుత్వం మళ్లీ గ్రామీణ అభివృద్ధికి చిన్న తరహా పరిశ్రమలకు ప్రాధాన్యం ఇస్తే, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 21వ శతాబ్దంలోకి దేశాన్ని తీసుకుపోవాలని ముఖ్యంగా రాజీవ్‌గాంధీ నాసి రకం యంత్రాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు. వాటితో ఉత్పత్తి చేసిన వస్తువులు ఇతర దేశ వస్తువులతో పోటీ పడలేకపోయాయి.

> విదేశీ వ్యాపార చెల్లింపుల శేషంలో విపరీతంగా లోటు పెరిగిపోయింది. రూపాయి విలువ పడిపోయింది. అప్పులు పెరిగిపోయి అప్పులు పుట్టని స్థితి వచ్చింది. దీని ఫలితమే ఎనిమిదో ప్రణాళికను సూచనాత్మక ప్రణాళికగా మార్చుకున్నాము. సంస్థాగత సర్దుబాటు పద్ధతి కింద ఐఎంఎఫ్ నుంచి అప్పు తెచ్చుకున్నాం. ఫలితమే ప్రైవేటీకరణ. కుంభకోణాలకు పునాది వేసిందే కాంగ్రెస్. ఇవి కొన్ని ఆర్థిక సంఘటనలు మాత్రమే. ఇదీ కాంగ్రెస్ చరిత్ర.అందుకే కేసీఆర్ మోసపోతే గోసపడుతారంటున్నారు.

భిన్నత్వంలో ఏకత్వానికి విఘాతం కలిగిస్తున్నది బీజేపీ. మతాన్ని అధికారానికి వాడుకుంటుంది ఆ పార్టీ. లౌకిక, ఇండియా అనే పదాలను చరిత్ర నుంచి తొలగిస్తున్నది. ప్రజాస్వామ్య నాలుగు స్తంభాలను, వాటి ఉనికిని ప్రశ్నిస్తుంది. సమాఖ్య వ్యవస్థను ప్రశ్నిస్తుంది. ఒకే దేశం, ఒకే మతం ఒకే విధానం- ఒకే పన్ను ఉండాలంటున్నది. వివిధ ప్రపంచ వేదికలలో ప్రపంచమే వసుధైక కుటుంబంలా ఉండాలంటున్నది. ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మడానికి ఏకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన ఘనత బీజేపీది. ధన బలంతో ఎన్నో రాష్ట్ర ప్రభుత్వాలను కూలగొట్టింది. కార్పొరేట్లకు సంబంధించిన రూ.12 లక్షల కోట్ల అప్పు ల్ని రద్దు చేసింది. ఇలా ఎన్నో సంఘటనలు. అందుకే కేసీఆర్ మోసపోతే గోసపడుతారంటున్నారు.

తెలంగాణ భూములంటే తొండలు గుడ్లు పెట్టే భూములనీ, ఈ జనానికి లొక్కం లేదని, పరిపాలన చేసుకోవడం కూడా చేతకాదని వెక్కిరించారు. మరి టీఆర్ఎస్ ఏం చేసింది? ప్రాణాలను పణంగా పెట్టి ఆరు దశాబ్దాల తెలంగాణ బానిస సంకెళ్లను తెంచింది. పాతాళంలో ఉన్న నీళ్లను తెచ్చి సస్యశ్యామలం చేసింది. తన్నుకు పోతున్న నిధులను ఆపి ధనిక రాష్ట్రంగా మార్చింది. ఎన్నో మౌలిక వసతుల్ని కల్పించింది. ఒక లక్షా 32 వేల ఉద్యోగాలు ఇచ్చింది. ప్రైవేట్ రంగంలో సుమారు 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చింది. పెట్టుబడులకు స్వర్గధామంగా మారింది. తలసరి ఆదాయం 150 శాతం పెరిగింది. విద్యుత్తు వినియోగం 100 శాతం పెరిగింది. ఇదీ తెలంగాణ అభివృద్ధి చరిత్ర. సమయం ఆసన్నమైంది. ఓటు ఎంతో అమోఘమైంది. కనుక సరైన వారిని ఎన్నుకోండి. మోసపోతే గోస పడుతారు.

పాండూరు ప్రభాకర్ రావు
90106 31727

విద్యార్థులకు రేవంత్ క్షమాపణ చెప్పాల్సిందే

తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోసింది ఉస్మానియా విశ్వవిద్యాలయం. తన బిడ్డలను ఉద్యమం వైపు నడిపించి తెలంగాణ తల్లి విముక్తి కోసం వారు చనిపోతుంటే కడుపు కోతను అనుభవించింది. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడటానికి ఉస్మానియా విశ్వవిద్యాలయమే ప్రధాన కారణం. నూతన ఉత్తేజం కలిగిన నాయకత్వాన్ని కూడా ఈ రాష్ట్రానికి, దేశానికి అందించిన ఘనత ఉస్మానియా యూనివర్సిటీది. తెలంగాణ ప్రజల్లో చైతన్యం నింపటంలోఉద్యమానికి వెన్నుదన్నుగా నిలబడ్డది కూడా ఉస్మానియా విద్యార్థి నాయకులే. అంతటి చరిత్ర గల ఉస్మానియా విద్యార్థులను అడ్డా కూలీలంటూ చిల్లర మాటలు మాట్లాడిన రేవంత్‌రెడ్డి విద్యార్థిలోకానికి క్షమాపణ చెప్పాలి.

ఉస్మానియా విశ్వవిద్యాలయం అంటేనే ఉద్యమాల పురిటి గడ్డ. ఇక్కడి విద్యార్థి నాయకులెందరో తెలంగాణ సమాజ భవితవ్యాన్ని నిర్దేశించే స్థాయికి ఎదిగారు. 1921లోనే ఉస్మానియా యూనివర్సిటీలో గ్రంథాలయ ఉద్యమం మొదలైంది. మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపింది ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులే. వారి త్యాగం వారి పోరాట పటిమ గురించి తెలియని వారుండరు. ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ఎంతోమంది విద్యార్థులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. తెలంగాణలో ఎలాంటి పోరాటానికి పిలుపు వచ్చినా ముందుండి పోరాడిన వారు ఉస్మానియా విద్యార్థులు . కేసీఆర్ 2009లో ఆమరణ నిరాహారదీక్ష చేస్తే వారికి తోడుగా నిలబడి నాటి సీమాంధ్ర పాలకులకు వెన్నులో వణుకుపుట్టించింది యూనివర్సిటీ విద్యార్థులే. గత్యంతరం లేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం చేస్తున్నామని ఢిల్లీ పెద్దలు చెప్పేలా ఒత్తిడి తీసుకువచ్చింది.

ఇంతటి చరిత్రగల ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల పట్ల టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఒక ఛానెల్ ఇంటర్వ్యూలో చాలా పరుష పదజాలంతో మాట్లాడారు. 'ఓయూ విద్యార్థి నాయకులు అడ్డామీద కూలీలు , కేటీఆర్ డబ్బులు ఇస్తే బీర్ తాగి, బిర్యానీ తిని కూలీల్లాగ వ్యవహరిస్తున్నారని' అవమానకరంగా మాట్లాడారు. ఇలా తెలంగాణకు తలమానికంగా ఉన్న ఉద్యమాల పురిటి గడ్డ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను చులకన చేసి మాట్లాడటం వారి అహంకారపూరిత ధోరణికి నిదర్శనం.

> ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల మీద రేవంత్ చేసిన వ్యాఖ్యలు విద్యార్థి లోకాన్ని అవమానపరిచేలా ఉన్నాయి. ఉస్మానియా విద్యార్థుల మీద ఇలాంటి వ్యాఖ్యలు చేయడమంటే తెలంగాణ అస్తిత్వాన్ని అవహేళన చేసినట్టే.

ఉస్మానియా విద్యార్థులు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన విషయం జగమెరిగిన సత్యం. కాంగ్రెస్ అనాలోచిత విధానాలు, కుట్రపూరిత రాజకీయాల మూలంగా ఎంతమంది విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకున్నారో మన కండ్ల ముందే ఉన్నది. ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న సమయంలో విద్యార్థుల మీద రబ్బరు బుల్లెట్లు , బాష్పవాయు గోళాలు, లాఠీ దెబ్బలతో విచక్షణా రహితంగా వ్యవహరించింది నాటి కాంగ్రెస్ పాలకులే. నాడు తెలంగాణ విషయంలో ద్రోహం చేసి విద్యార్థుల ఆత్మబలిదానాలకు కారకులయ్యారు. అదే విధంగా నేడు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఉస్మానియా విద్యార్థులపై విషం చిమ్ముతున్నాడు.

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులను తమ అవసరాలకు వాడుకున్నది కాంగ్రెస్ పార్టీనే. రేవంత్‌రెడ్డి చరిత్ర మరిచి వ్యవహరిస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఓయూ విద్యార్థులను వాడుకొన్న కాంగ్రెస్ వారికి ఎలాంటి పదవులు ఇచ్చి గౌరవించలేదు. అదేవిధంగా నేడు కూడా కాంగ్రెస్‌లో అనేక మంది విద్యార్థి నాయకులకు పార్టీ టికెట్ ఇస్తామని మభ్యపెట్టి గొంతు కోశారు. అదే సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఎందరో విద్యార్థి నాయకులకు ప్రత్యక్ష , పరోక్ష రాజకీయాల్లో అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. విద్యార్థి నాయకుల్లో కొంతమందికి ఎంపీలుగా, ఎమ్మెల్యేలుగా, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లుగా అవకాశం కల్పించారు. విద్యార్థులకు కాంగ్రెస్ చేసి ందేమీ లేకపోగా ఉస్మానియా విద్యార్థులను అవమానించేలా మాట్లాడిన రేవంత్‌రెడ్డి విద్యార్థి లోకానికి క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో రేవంత్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పడానికి విద్యార్థులు సిద్ధంగా ఉన్నారు.

రాజేష్ నాయక్ జీ
9603579115

గారడీ వీడియోలపై నిఘా

ప్రపంచీకరణ దృష్ట్యా సాంకేతిక పరిజ్ఞానం అద్భుతంగా అభివృద్ధి చెందుతున్నది. ఎలక్ట్రానిక్ విధానాల వాడకం, ఆటోమేషన్, అదేవిధంగా సినీ పరిశ్రమల్లో ఓటీటీ విప్లవం రావడం చూస్తున్నాం. సమాజంలో జరుగుతున్న విషయాలను సైతం నేడు మనం అనేక సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకుంటున్నాం. కానీ, సాంకేతికతను వాడే విధానం కూడా తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

రాజకీయాలు, ప్రభుత్వ విధానాలను గురించి ప్రజలకు తెలియజేసే సమయంలో మాధ్యమాలు కొంత అదుపులో ఉంటూ సరైన విషయాన్ని ప్రజలకు చేరువ చేయాలి. కానీ, దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో రాజకీయ స్వాతంత్ర్యం ఎక్కువగా ఉంది కాబట్టి, కొంతమంది రాజకీయ నిరుద్యోగులు, ప్రతిపక్షాలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రభుత్వంపై విషాన్ని చిమ్ముతున్నాయి. కేసీఆర్‌ను విమర్శించడమే పనిగా కొన్ని యూట్యూబ్ చానళ్లు పనిచేస్తున్నాయి.

జర్నలిజం విలువలను మంటగలిపేవిధంగా చేష్టలు, వారి ప్రవర్తన ఆ చానెళ్లలో ప్రసార సమయంలో స్పష్టంగా కనిపిస్తాయి. అసలు ఈ యూట్యూబ్ చానెళ్లు ఎవరి ఆధీనంలో నడుస్తున్నాయి, వీరు ప్రజల్లో లేని అపోహలను ఎందుకు కలిగిస్తున్నారో వారికే తెలియాలి. సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల పాత్ర భారీగా పెరిగింది. ప్రభుత్వానికి ప్రజల మధ్య ఉన్న సంబంధాన్ని చాలా దగ్గర చేశాయి.

ఈ రోజు అనేక ప్రభుత్వ కార్యక్రమాలను ఫేస్‌బుక్ లైవ్‌లో ప్రత్యక్ష ప్రసారం చూస్తున్నాం. ట్విట్టర్ లాంటి మాధ్యమాల ద్వారా నాయకులకు నేరుగా మన సమస్యలను వివరిస్తున్నాం. అనేక రాజకీయ పార్టీలు వారి ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల ముందుకు తీసుకువెళ్తున్నారు. ఈ విధంగా ప్రస్తుత కాలంలో ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య గల సంబంధాలు బలపడ్డాయి. ఇదే అదనుగా కొంతమంది రాజకీయకక్షతో యూట్యూబ్ చానెళ్లు మొదలుపెట్టి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకతను కల్పించడమే వీరి లక్ష్యం. పరుషమైన పదజాలంతో ముఖ్యమంత్రి, మంత్రులు అనే తేడా లేకుండా అడ్డగోలుగా విషప్రచారం చేస్తున్నారు. ప్రతిరోజు పనికిమాలిన విమర్శలు చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ప్రజలకు వార్తలను చేరవేస్తున్నట్టు, ప్రశ్నిస్తా అనే ముసుగులో అర్థం పర్థంలేని విమర్శలు చేస్తున్నారు. వీటిని అడ్డుకోకపోతే ప్రజల్లో లేని అపోహలను సృష్టించే ప్రమాదం పొంచి ఉన్నది. ప్రశ్నకు, విమర్శకు తేడా తెలియని స్థితిలో కొంతమంది యూట్యూబర్లు ఉండటం విడ్డూరం.

జర్నలిజాన్ని ప్రజలు ప్రజాస్వామ్యానికి నాలుగోస్తంభంగా భావిస్తారు. ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజలకు నేరుగా చేరవేయడమే జర్నలిస్టు ముఖ్య లక్షణం. ప్రభుత్వం చేస్తున్న పనులను సైతం ప్రశ్నించే హక్కు కూడా వారికి ఉంది. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేవిధంగా జర్నలిస్టులు వ్యవహరించేవారు. కానీ, నేడు పుట్టుగొడుగుల్లా పుట్టుకొచ్చిన యూట్యూబ్ చానెళ్ల మూలంగా జర్నలిజం విలువలే ప్రశ్నార్థకమైపోయాయి. కొన్ని చానెళ్లు కేవలం కేసీఆర్, కేటీఆర్, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ఏ రోజు కూడా సమస్యను ప్రశ్నించకుండా కేవలం పరుష పదజాలంతో విమర్శలే తప్ప వీరివల్ల లాభపడిందేమీ లేదు. నాన్‌సెన్స్ జోకులు, వార్తా సంస్థలను విమర్శించుకుంటూ, తప్పుడు వార్తలు, వాట్సాప్‌లో వచ్చే ఫేక్ వార్తలను చదువుతూ ప్రజల్లో విషాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. టూల్ కిట్ సహాయంతో వారు చదివేవార్తలకు కామెంట్ల రూపంలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ కామెంట్స్ కనపడటం, పోల్స్ నిర్వహించి వారే ఓట్లు వేసి ప్రజలను తప్పుదోవ పట్టించేవిధంగా ఒక వికృతమైన రాజకీయానికి అడ్డాగా ఈ యూట్యూబ్ చానెళ్లు పనిచేస్తున్నాయి. వీటిని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

> ఎలక్ట్రానిక్ మీడియా మాదిరి ఈ యూట్యూబ్ చానెళ్లు ఒక నియమావళిని ఏర్పాటుచేయాలి. జర్నలిజం కోర్సును చేసినవారికే ప్రాధాన్యం ఇవ్వాలి. కంప్లైంట్ల అథారిటీని ఏర్పాటుచేసి సామజిక మాధ్యమాల్లో వారి చానెళ్లను వీక్షించే అవకాశం ప్రజలకు ఇవ్వాలి. సెన్సార్ సిస్టంను ఆ చానల్ నడిపే సంస్థలు ఏర్పాటు చేసుకొని ఆ తర్వాతే సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయాలి.

ఇటీవల కేంద్రం తెచ్చిన Digital Media Ethics Code (Social Media Intermediary Guidelines 2022 నియమాలను తక్షణమే అమలుచేయాలి. వారికి వచ్చే వార్తలను ముందుగా ఫ్యాక్ట్ చెక్ సహాయంతో చెక్ చేసుకొని తర్వాతే అవి ప్రసారం చేయాలి. ఈ విధంగా ఒక నియంత్రణ అనేది ఉంటేనే ప్రజలకు పాజిటివ్ సెన్స్‌లో వార్తలు చేరుతాయి. వారు కూడా అదేవిధంగా ఆలోచిస్తారు. ఇలా చేయకపోతే ప్రభుత్వం చేసే ప్రతి మంచి పనిని కొన్ని యూట్యూబ్ చానెళ్లు ప్రజలకు తప్పుగానే చూపిస్తాయి. దీనివల్ల వారి ఆలోచనా ధోరణి వికృతంగా మారే అవకాశం ఉంటుంది.

రాజ్యాంగం ప్రకారం ప్రశ్నించే హక్కు అందరికీ ఉంది. కానీ, మనం ప్రశ్నిస్తున్నామా, లేక అడ్డగోలు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నామా? అనేది ఒక్కసారి గ్రహించాలి. ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలియజేస్తూనే లోటుపాట్లను సైతం సవరించే హక్కుంది. కానీ, రాజకీయ కక్షతో రాజకీయ పార్టీల అండదండలతో యూట్యూబ్ చానెళ్లు నడుపుతూ వికృతమైన రాజకీయం చేయడం సిగ్గుచేటు. ఇలాంటి చానెళ్ల మీద ప్రభుత్వం ఒక నిఘా వ్యవస్థను ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉన్నది.

కన్నోజు శ్రీహర్ష
89851 30032

ఒకే ఒక్కడు...గులాబీ దళపతి. ఆయనే ఒక సైన్యం. రాజకీయ రణరంగంలో శత్రు శిబిరాన్ని మాటల తూటాలతో ఎదుర్కొంటూ రాకెట్‌లా దూసుకెళ్తున్న సైన్యాధిపతి. ఆయన ఒక నిఫా తుఫాన్..రాజకీయ వాయుగుండంలా..రోజుకు వందల కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్తున్నారు. నిర్దిష్టమైన, నిర్మాణాత్మకమైన రాజకీయ కార్యాచరణతో లక్ష్యాన్ని చేరుకోవాలని తలపోస్తున్నారు.

దూసుకుపోతున్న కారు

సీఎం కేసీఆర్ రోజుకు మూడు సభల్లో పాల్గొంటూ కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపేలా ఉపన్యసిస్తూ సబ్బండ వర్గాలను ఆకర్షిస్తున్నారు. కొన్ని సభల్లో ఉద్వేగ భరితంగా ప్రసంగిస్తూ పార్టీ శ్రేణుల్లో ఆలోచన రేకెత్తిస్తున్నారు. మరికొన్ని సభల్లో జోష్‌గా మాట్లాడుతూ ఊపు తెప్పిస్తున్నారు. అదే సందర్భంలో విపక్షాలపై నిప్పులవర్షం కురిపిస్తున్నారు. ఏ ప్రాంతం వెళ్ళినా ఏ నియోజక వర్గం దరిచేరినా.. ఏ జిల్లాలో అడుగు పెట్టినా పార్టీ శ్రేణులు, సామాన్య వర్గాలు 'మీ అడుగులో అడుగేసి ప్రయాణిస్తాం, మీకే పట్టం కడుతా' మంటూ గులాబీ దళపతి కేసీఆర్‌కు భరోసా ఇస్తున్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాల ప్రగతి ఫలాల గురించి ప్రజలకు వివరిస్తూనే ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను కేసీఆర్ ఏకరవు పెడుతుండటంతో ఎత్తిన జెండా దించకుండా సభల్లో పాల్గొన్న జనవాహిని సమరోత్సాహంతో కేసీఆర్‌కు జేజేలు పలుకుతున్నది. ఏ సభ చూసినా వేలు, లక్షల్లో గులాబీ సైన్యం తరలి రావడం చూస్తే సంచలన విజయంతో హ్యాట్రిక్ సాధించే దశగా బీఆర్ఎస్ జగన్నాథ రథం ముందుకు సాగుతున్నది.

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజక వర్గం నుంచి కేసీఆర్ ప్రచార జైత్రయాత్రకు అంకురార్పణ చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత టీఆర్ఎస్ 2014లో 66 స్థానాల్లో విజయభేరి మోగించి తొలిసారి అధికార పీఠాన్ని కైవసం చేసుకున్నది. 2018 లో వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడతో ముందస్తూ ఎన్నికల గోదాలోకి దిగిన గులాబీ బాసు 88 సీట్లు సాధించి రెండవసారి అధికారాన్ని కైవసం చేసుకున్నారు. కేసీఆర్‌కు రెండు ఎన్నికల్లోనూ హుస్నాబాద్ కలిసి రావడంతో మూడవసారి మళ్లీ సెంటిమెంట్ అయిన హుస్నాబాద్ గడ్డ నుంచే ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. తొలివిడత ఎన్నికల సభలన్నీ విజయవంతమయ్యాయి. ఏ సభలో ప్రసంగించినా కొత్త కొత్త విషయాలు, సంభాషణలు, సామెతలతో ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తున్నారు.

సభలో కేసీఆర్ చెప్తున్న సామెతలు నవ్వుల పువ్వులు పూయిస్తుండటంతో కార్యకర్తలు చప్పట్ల వర్షం కురిపిస్తున్నారు. కేసీఆర్ తనదైన విభిన్న శైలిలో ప్రసంగం ప్రారంభించగానే జనం నినాదాలతో హోరెత్తిస్తున్నారు. ఏ ప్రాంతంలో సభ నిర్వహించినా స్వచ్ఛందంగా గులాబీ జెండాను చేబూని జనం తండోపతండాలుగా తరలివస్తూ మీ వెంట ఉంటాం అంటూ కదం తొక్కి పదం పాడుతున్నారు.

ప్రస్తుతం అమలు చేస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్తు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతు బంధు, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్, రైతు బీమా, దళిత బందు, అమ్మఒడి, కేసీఆర్‌కిట్టు, భరోసా, న్యూట్రిషన్, దివ్యాంగులకు, బీడీ కార్మికులకు పింఛన్లు, ముఖ్యమంత్రి సహాయనిధి వంటి పథకాలను ప్రతి సభలో కేసీఆర్ లెక్కల వారిగా వివరిస్తుండటంతో ప్రగతి, సంక్షేమ ఫలాలు అందిస్తున్న ప్రదాత కేసీఆర్ అంటూ జెండాను రెప రెప లాడిస్తున్నారు.

> తెలంగాణలోని 3 కోట్ల 50 లక్షల మంది జనాభాలో ప్రతి ఇంట్లో ఇద్దరు లేదా ముగ్గురు ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రగతి శీల పథకాలను అందుకుంటున్న విషయాన్ని కేసీఆర్ సభల్లో గుర్తు చేస్తుండటంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇలా అన్ని వర్గాల జనం మళ్లీ మాకు ముఖ్యమంత్రి మీరే కావాలంటూ కేసీఆర్‌కు బాసటగా నిలుస్తున్నారు.

శాసనసభ ఎన్నికల్లో మళ్లీ గెలిస్తే ఏయే సంక్షేమ పథకాలు అమలు చేస్తారో సభల్లో ప్రకటిస్తుండటంతో సబ్బండ వర్గాలు బ్రహ్మరథం పడుతున్నాయి. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే రూ.400 లకే గ్యాస్ సిలెండర్, దివ్యాంగులకు రూ 6 వేల పింఛన్, ఎకరానికి 16 వేలు రైతుబంధు, ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లు రూ.2 వేల నుంచి దశల వారిగా రూ.5 వేలకు పెంపు, ఆరోగ్యశ్రీ పథకం రూ.15లక్షలకు పెంపు ఇలా కొత్తగా అమలు చేసే పథకాల గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ వివరిస్తుండటంతో పార్టీ శ్రేణుల్లో ,ప్రజల్లో ఎనలేని ఉత్సాహం మనో ధైర్యం కనిపిస్తున్నది.

ప్రచార పర్వంలో కేసీఆర్ దూసుకెళ్తుండటంతో విపక్షాల్లో వణుకుపుడుతున్నది. కేసీఆర్ రోజుకు మూడు, నాలుగు బహిరంగసభల్లో పాల్గొంటూ మాటల తూటాలు సంధిస్తుండటంతో ప్రధాన రాజకీయ పక్షాలు బెంబేలెత్తిపోతున్నాయి. ఎన్నికల నాటికి మరిన్ని సభల్లో పాల్గొననున్న కేసీఆర్ ఉత్తేజభరిత ప్రసంగాలతో రాజకీయ తుఫాన్ సృష్టించనున్నారు.

గుర్రం రాంమోహన్ రెడ్డి
79810 18644

తెల్లని మెలుకువ కప్పుకుని

మనిషి మనిషిలో నల్లని
స్పర్శకు తప్పుకు తిరుగుతూ
ముఖం చిట్లి
చూపు పీలికలు కాకుండా
నాలుకపై ఎగుడు దిగుడు శబ్దంతో
అర్థం ముక్కలు కాకుండా
అసూయ తాపానికి
పగ రాజుకోకుండా
కలను కూర్చే
కోరికల అడుగు మెలిక పడకుండా
తెల్లని మెలుకువ కప్పుకుని
తనకు తాను గుచ్చుకోకుండా
మెత్తని మచ్చికతో
మనసు మెల్లగా నడవాలి.

చందలూరి నారాయణరావు
97044 37247